క్లుప్తంగా

రేపు మున్సిపల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు నుదురుపాడులో న్యాయవిజ్ఞాన సదస్సు

నరసరావుపేట టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ గురువారం తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు వినాయక ఆలయం వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అదే విధంగా శనివారం నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యాయమూర్తి పాల్గొని చట్టాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్ఫూర్తి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

శావల్యాపురం: విజయవాడలో శనివారం బీజేపీ పార్టీ అధ్యక్షులు మాధవ్ సారథ్యంలో విముక్తి దినోత్సవం పురస్కరించుకొని స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా గురువారం పలు గ్రామాల్లోని ఎస్టీ కాలనీలో ర్యాలీలు నిర్వహించినట్లు మండల పార్టీ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని మతుకుమల్లి, వెలమవారిపాలెం, శావల్యాపురం గ్రామాల్లోని ఎస్టీ కాలనీల్లో బిజెపి నేతలు పర్యటించారు.

వేర్వేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

వినుకొండ: మండలంలోని తిమ్మాయపాలెం భారతపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మండల వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశానుసారం రైతులు పొగాకు పంట సాగు చేయవద్దని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలుగా కంది, ఆముదం నీటి వసతి ఉన్న రైతులు మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవాల్సిందిగా తెలిపారు. కౌలు రైతులకు కూడా సీసీఆర్సీ కార్డు పొంది పంట నమోదు చేయించుకున్న రైతు సేవా కేంద్ర సిబ్బందికి అందజేసిన ఎడల అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, రైతులు పాల్గొన్నారు.

ఇస్కాన్ గోశాలకు విరాళం అందజేత

నరసరావుపేట: బీసీ సీనియర్ నాయకులు, యదువంశ భీష్మ బోయన సుబ్బారావు యాదవ్ సతీమణి వెంకటలక్ష్మిదేవి తృతీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు బోయిన పిచ్చేశ్వరరావు, రాజా వెంకట కోటేశ్వరస్వామి, మేజర్ శ్రీరామకృష్ణంరాజు ఇస్కాన్‌కు చెందిన గోశాలకు గురువారం రూ.15వేలు విరాళాన్ని అందజేశారు. ఇస్కాన్ ప్రతినిధులు రూపేష్, వైష్ణవ, కృష్ణచంద్ర చైతన్య, రమణారాడ్డి, గుండా శ్రీను, కొమ్మాలపాటి జవహర్ ప్రభు పాల్గొన్నారు.

పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలి

వినుకొండ : రాష్ట్రంలో బషీర్ బాగ్ అమరవీరుల సాక్షిగా మరో కరెంటు ఉద్యమాన్ని కొనసాగించడం జరుగుతుందని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గోపాలరావు తెలిపారు. వామపక్షాల పిలుపుమేరకు గురువారం శివయ్యస్థూపం సెంటర్‌లో పెంచిన కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.15 వేల కోట్ల కరెంటు చార్జీలు తగ్గించాలని, ట్రూ అప్ చార్జీల పేరుతో మరో రూ.12 వేల కోట్లు చార్జీల పెంపుదల ఆలోచనలు విరమించుకోవాలన్నారు. వామపక్ష నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, ఎం. సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, మల్లికార్జునరావు, మస్తాన్, నాగబ్రహ్మం, హనుమంతరెడ్డి, బొంకూరి వెంకటేశ్వర్లు, చిదంబరం పాల్గొన్నారు.


నరసరావుపేటలో క్లాత్ మార్కెట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన వినాయకుడు


చిలకలూరిపేట చలివేంద్రబజారులో ఏర్పాటైన వినాయక విగ్రహం


వినుకొండలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


చిలకలూరిపేట షరాఫ్ బజారులో అమెరికన్ డైమండ్ల వినాయకుడు


బొల్లాపల్లిలో ప్రత్యేక అలంకరణలో గణపతి

ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటు నేనయ్య...

వాడవాడలా అంగరంగ వైభవంగా వినాయకచవితి వేడుకలు

నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలు వినాయక చవితి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఎవరి గృహాలలో వారితో పాటు, గ్రామాలతో పాటు పట్టణంలోని పలు వీధుల్లో భక్తులు గణనాధుల ప్రతిమలు ఏర్పాటు చేసి భక్తిభావంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాకుమాను వారిబజారు, క్లాత్ మార్కెట్ సెంటర్, టెలిఫోన్ ఎక్సేంజ్ సెంటర్ల వద్ద భారీ ప్రతిమలను ఏర్పాటు చేశారు. రెండో రోజు గురువారం సాయంత్రం సమయంలో ఈ విగ్రహాలను చూసేందుకు భక్తులు వందలాదిగా పాల్గొని చూసి తరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో పాటు పలువురు పట్టణ ప్రముఖులు సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రెండోరోజు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలోని విగ్రహం వద్ద 1108 వెలగపండ్లతో సహస్ర అష్టోత్తర పూజా కార్యక్రమం నిర్వహించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో బుధవారం వినాయక చవితి పండుగను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో గల వినాయకుని ఆలయాలను భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్ళల్లో మట్టి వినాయకుని విగ్రహాలను తీసుకుని పత్రి, పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. విద్యార్థులు తమ పుస్తకాలను వినాయకుని విగ్రహాలకు ఉంచి పూజలు నిర్వహించి వినాయకుని స్తోత్రములను పఠించారు. మండలంలో అన్ని గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను భారీగా ఏర్పాట్లు చేశారు. గ్రామాలల్లో వినాయకుని విగ్రహాలను డీజే శబ్దాలతో, కనకతప్పెట్లతో, బాణా సంచాలు కాలుస్తూ భారీగా ఊరేగించారు.

బొల్లాపల్లి: సర్వకార్యాల్లో తొలి పూజలు అందుకునే విఘ్నేశ్వరుడికి అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయక చవితి పండుగను బుధవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండపాలలో గణనాధుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. సర్వకార్యాలను సిద్ధింపజేసే గణపతికి పత్రి గణనాథుడికి ఇష్టమైన ఉండ్రాళ్లు లడ్డు ప్రసాదం సమర్పించి వైభవోపేతంగా పూజలు చేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: ప్రతి పూజలో తొలి నివేదన అందుకునే గణనాథుడు ఊరూ వాడా కొలువుదీరాడు. వినాయక చతుర్దశిని పురస్కరించుకుని పూజలందుకున్నాడు. మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. గణపవరంలోని కోదండ రామాలయంలో మట్టి వినాయకుడిని ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించిన మట్టి గణపతిని ఆలయ పూజారి ఉమామహేశ్వర శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గణపవరం నుంచి నాదెండ్ల వెళ్లే డొంక రోడ్డులో కొలువైయున్న నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయంలో గణపతి పూజకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. గణపవరంలో ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లడ్డూను రూ.22 వేలకు గ్రామానికి చెందిన పెదపల్లి నాగమల్లి దక్కించుకున్నారు. విగ్రహానికి గ్రామోత్సవం చేసి నిమజ్జనం నిర్వహించారు.

వినుకొండలో..

వినుకొండ: వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంలోని పలు ప్రధాన సెంటర్లలో దేవాలయాలలో వినాయక చవితి పర్వదిన వేడుకలు ఘనంగానిర్వహించారు. ప్రత్యేక మండపాలల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ఏడు రోజులపాటు పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాలకు తరలించేందుకు సిద్ధం చేశారు. పట్టణంలోని మెయిన్ బజారు, ఫ్యాన్సీ కొట్ల సెంటర్, బంగారం కొట్ల సెంటర్, దక్షిణంబజారు గమిడి ఆంజనేయస్వామి దేవాలయం, కొండమెట్ల వినాయక స్వామి దేవాలయాలు, బోసు బొమ్మ సెంటర్లోని వినాయక స్వామి దేవాలయం, శివాలయం వద్ద విగ్రహాలను ఏర్పాటు చేశారు. అలాగే శాలివాహన నగర్ మక్కెన నగర్,కొత్తపేట, రెడ్డినగర్, విష్ణుకుండి నగర్, మార్కాపురం రోడు తోపాటు పలు కాలనీలో కూడా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండుగనాడు తెల్లవారుజాము నుంచే విఘ్నేశ్వరుడికి ఇష్టమైన పత్రిని కొనుగోలు చేశారు. గరిక, ఉసిరి, నేరేడు, దానిమ్మ, జమ్మి తదితరాల విక్రయాలతో వీధులు కళకళలాడాయి. ప్రతి ఏటా పండుగను పురస్కరించుకొని షరాఫ్‌బజార్, చలివేంద్రబజారు, తవ్వా బాపనయ్య వీధి, గాంధీపేట, మార్కెట్ సెంటర్, సుబ్బయ్యతోట, పండరీపురం, పురుషోత్తమపట్నం తదితర చోట్ల భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయటం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా చవితి పందిళ్లు ఏర్పాటు చేసి లక్షలు వెచ్చించి పోటాపోటీగా వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. షరాఫ్‌బజారులో రూ.10 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన అమెరికన్ డైమండ్ల వినాయకుడితో పాటు చలివేంద్రబజారు తదితర చోట్ల ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

యడ్లపాడులో...

యడ్లపాడు: గణేష్ చతుర్థి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది పోలీసులు 83 వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. గణపతి విగ్రహాలను పందిళ్లలో అద్భుతంగా అలంకరించారు. పండుగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రథమ పూజితుడైన గణనాథుడి మహిమల గురించి అర్చకులు భక్తులకు వివరించారు.

మూడు విగ్రహాలు నిమజ్జనం...

యడ్లపాడు, లింగారావుపాలెం, వంకాయలపాడు గ్రామాల్లో గురువారం మూడు విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనం కోసం తరలించారు. భక్తులు గణనాథుని భక్తి పాటలతో ఆకట్టుకున్నారు.


గణపవరం కోదండరామాలయం వద్ద మట్టి వినాయకుడి పూజల్లో భక్తులు


నాదెండ్ల నందికుంటలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

ఆరడుగుల మట్టిగణపయ్య..

శావల్యాపురం: సంప్రదాయంగా ప్రకృతి, మానవ మనుగడకు నష్టం వాటిల్లకుండా కాలుష్యం లేని విధంగా మండలంలోని వేల్పూరు గ్రామంలో 6 అడుగుల ఉత్సవ మట్టి విగ్రహన్ని తయారు చేసినట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు బుధవారం తెలిపారు. ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో వినాయకచవితి వేడుకలు సందర్భంగా మట్టి విగ్రహన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశామన్నారు. ఎలాంటి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కృత్రిమ రంగులు వినియోగించలేదన్నారు. పర్యావరణం హాని జరగకుండా ఉండాలని ఉద్దేశంతో మట్టి విగ్రహాలను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. కేవలం చెరువు మట్టి ఇటుకలు, కలప వెదురు బద్దలు, అలంకరణ పసుపు కుంకుమ అరటి ఆకులతో ప్రత్యేకంగా విగ్రహన్ని విశ్వబ్రాహ్మణులు



సారథ్యంలో విగ్రహం తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో మట్టి ప్రతిమలు 150 ఉచితంగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కుందుర్తి నాగరాజు, ఆదిశేషయ్య, నరసింహారావు, అజయ్‌కుమార్, సిద్ది ప్రసాదు, ఏకాంభరం, వీరబ్రహ్మం మహిళలు పాల్గొన్నారు.


శావల్యాపురంలో..


శావల్యాపురంలో జరిగిన వినాయక చవితి పూజల్లో పాల్గొన్న భక్తులు

శావల్యాపురం: మండలంలో అన్నీ గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మట్టి ప్రతిమలు వివిధ రకాల పత్రితో చిన్నారులు పెద్దలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక విగ్రహాలను పూలమాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. రాత్రిపూట పందిళ్ల విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. వేద పండితులు, వేదమంత్రాలు, లౌడుస్పీకర్ల నడుమ సంప్రదాయబద్ధంగా, గణనాథుడికు పూజా కార్యాక్రమాలు చేశారు. శావల్యాపురంలో ఆర్యవైశ్య వీధిలో గణనాధుడు 11వ వార్షికోత్సవాన్ని వైభవంగా జరుపుతున్నారు. స్థానిక ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో బైండోవర్ చేయించుకున్నారు. గ్రామాల్లో పోలీసులు నిఘా ఉంచామని ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.


నరసరావుపేటలో కాకుమాను బజార్‌లో వ్యాపారులు ఏర్పాటుచేసిన గణనాధుడు


నరసరావుపేటలో టెలిఫోన్ ఎక్ఛేంజ్ వద్ద వ్యాపారులు ఏర్పాటుచేసిన భారీ గణనాధుడు


చిలకలూరిపేట టీజీ స్ట్రీట్‌లో ఏర్పాటైన వినాయక విగ్రహం


విప్పర్లలో భక్తులు ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ


యడ్లపాడులోని గ్రామంలో ఏర్పాటు చేసిన లంబోదరుడు

ట్రంప్ పన్నులతో దేశంలో ఆర్థిక సంక్షోభం

నరసరావుపేట: అమెరికా అధ్యక్షులు డోనాల్డ్‌ట్రంప్ ప్రతిపాదించిన పన్నులపై అమెరికా–ఇండియా డెలిగేట్స్ మధ్య జరుగుతున్న చర్చలు ఎంత మేరకు ప్రయోజనం చేకూరుస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. పదిరకాల కీలక ఉత్పత్తులు రూ.7 లక్షల కోట్ల విలువైన దిగుమతులపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ అండతో 60 శాతం పన్నులు విధించిన ట్రంప్ విధానాలతో దేశ ఆర్థిక పరిస్థితి మరింత సంక్షోభంలోకి వెళుతుందని విమర్శించారు. రైతులు నీటిని కొనుగోలు చేసి సాగుచేయాల్సిన పరిస్థితి పాలకులు తీసుకువచ్చారని, ఎత్తిపోతల పథకాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించరాదన్నారు. వరికపూడిసెల నిధులు కేటాయించకుండానే పనులు ప్రారంభిస్తున్నామని జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, మాచర్ల, వినుకొండ ఎమ్మెల్యేలు ప్రకటించడం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, వై రాధాకృష్ణ, ఎస్.ఆంజనేయులు నాయక్, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రంలో చంద్రబాబు–లోకేష్‌ల అరాచకపాలన

- హత్యా రాజకీయాలపై ఎమ్మెల్యే మాట్లాడటం హాస్యాస్పదం
- జీవీ కనుసన్నల్లో రేషన్, మట్టి, ఇసుక, అక్రమ మద్యం
- వెంకటప్రసాద్ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తా
- వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా విమర్శ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: పారదర్శక పాలన అందిస్తామన్న చంద్రబాబు, లోకేష్‌లు అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టి.అన్నారం గ్రామంలో వైఎస్సార్ సీపీ బూత్ ఏజెంట్ వెంకట ప్రసాద్‌పై గోపి అనే యువకుడు కత్తితో హత్యాయత్నం చేస్తే అతనిపై పెట్టీ కేసు నమోదు చేసి కత్తిపోట్లకు గురై ప్రాణాపాస్థితిలో ఉన్న వ్యక్తిపై కూడా కేసు నమోదు చేయడం కూటమి ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ఇదేనా పారదర్శక పాలన అని ప్రశ్నించారు. వికలాంగుల పింఛన్ కూడా తొలగించిన ఘనత కూటమి సర్కారుకే దక్కుతుందన్నారు.

హత్యా రాజకీయాలకు అంబాసిడర్ జీవీ

సొంత వ్యాపార భాగస్వామినే హత్య చేసిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హత్యా రాజకీయాల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని బొల్లా అన్నారు. ఎక్కడైనా గొడవలు జరిగితే వైఎస్సార్ సీపీ కండువాలు కప్పిన ఫొటోలు మీడియాకు చూపించి మీ పార్టీ వాళ్లే కొట్టుకున్నారని ఎమ్మెల్యే మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సింబల్‌తో గెలిచిన వారందరూ ఇప్పుడు టీడీపీలో చేరారని వారు ఇప్పుడు తప్పులు చేసినా కూడా మా పార్టీకి అంటగట్టడం ఎంతవరకు సమంజసం అన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన చేపల చెరువుల పేరుతో ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని, ఆ దోపిడీని కూడా మా పార్టీకి అంటగడతారా అని ప్రశ్నించారు. రేషన్ బియ్యం అక్రమ మార్గాల ద్వారా అమ్ముకుంటున్నారని, ఇవన్నీ మీకు తెలియకుండా జరుగుతున్నాయా? అని ఎమ్మెల్యేని ప్రశ్నించారు. వినుకొండలో శాంతి భద్రతలు క్షీణించాయని అన్నారు. ఇటీవల కాలంలో పట్టణంలో ముగ్గురు మహిళలు హత్యకు గురయ్యారని తెలిపారు. పట్టణం నడిబొడ్డున ఉన్న కోట్లాది రూపాయల క్రిస్టియన్ ఆస్తులు, ఏబీఎం ఆస్తులు ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నది ఎవరని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలకు ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. మీరు ఎన్ని అక్రమాలకు పాల్పడిన అరాచకాలు సృష్టించినా భయపడేది లేదన్నారు. కార్యకర్తల కోసం ప్రాణమైన త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, అధికారం శాశ్వతం కాదన్నారు.

కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తే పోరాడుతాం

వెంకటప్రసాద్ కేసుని నీరుగార్చే ప్రయత్నం చేస్తే న్యాయపోరాటానికి దిగి ఆ కుటుంబానికి న్యాయం చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, ప్రసాద్, బేతం గాబ్రియేలు, తెల్లాకుల రాజేష్ ఖన్నా, గంధం బాలిరెడ్డి, రొడ్డా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

భిన్న స్వరాలు కవితా సంకలనానికి మంచి గుర్తింపు

- తెలుగు ఉపాధ్యాయురాలిగా సేవలతో పాటు పలు అవార్డులు అందుకున్న రచయిత పద్మ
- ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్

‘ తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను / తెలుగు వల్లభుండ తెలుగొకండ / యెల్లనృపుల గొలువ నెఱుగవే బాసాడి / దేశభాషలందు తెలుగు లెస్స ’ అని తెలుగుభాషా వైభవాన్ని ఆనాడే కీర్తించి ఆదరించారు శ్రీకృష్ణ దేవరాయలు. మన తెలుగు భాషలో ఉన్న ప్రౌఢశైలి, శబ్దగుంభనం, పద మాధుర్యం మరే భాషలో ఉండదన్నది జగమెరిగిన సత్యం. అలాంటి తెలుగుభాషకు పట్టం కట్టిన వారిలో గురజాడ, గిడుగు, శ్రీశ్రీ, జాషువా వంటి ఎందరో మహానుభావులు తెలుగు తల్లి గుమ్మంలో వెలిగించిన గుమ్మటాల వెలుగులే తెలుగు భాష స్థిరత్వానికి నేటికీ ఊపిరిలూదుతున్నాయి. తల్లికి ప్రత్యామ్నాయం లేనట్లే తల్లిభాషకు లేదన్నది పెద్దల మాట. ఆ మాటను పుణికి పుచ్చుకుని ఎందరో కవులను ఆదర్శంగా తీసుకుని తెలుగు భాష ‘చెరకు రసమ్ముల కన్న / ప్రవచింప తేనియ జాలుకన్న / భాసుర సుధకన్న / తియ్యనగు చూతఫలంబుల కన్న / తెలుగు భాష తియ్యనురా’ అనేలా తన రచనలు సాగిస్తున్నారు వినుకొండ ప్రాంతానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలు.

వినుకొండ: తెలుగుభాష గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేసిన గొప్ప కవులు ఎంతో మంది ఉన్నారు. భాష ఔన్నత్యాన్ని కాపాడారు. వీరికోవలోని వారే వినుకొండకు చెందిన గరం(జాషువా. గబ్బిలం, ఫిరదౌసి వంటి రచనలతో అందర్నీ ఆకట్టుకున్నారు ఆయన. ఆ మహానీయుడిని స్ఫూర్తిగా తీసుకుని ఓ మహిళా ఉపాధ్యాయురాలు. తెలుభాషపై మక్కువతో తెలుగు గొప్పతనాన్ని వివరిస్తూ ప్రముఖ కవుల పద్యాలను, కవితలను వివరిస్తూ ఇటీవల ఆమె రాసిన భిన్న స్వరాలు కవితా సంపుటికి మంచిగుర్తింపు లభించింది. ఒకవైపు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ మరోవైపు తెలగు సాహిత్య వ్యాప్తి కోసం కృషిచేస్తున్నారు ఆమె.

తెలుగు పండిట్‌గా పనిచేస్తూ...


స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ వి.పద్మ తెలుగు భాషాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు. 2005 లో తెలుగు పండిట్‌గా ప్రభుత్వఉద్యోగం సంపాదించిన ఆమె అంకిత భావంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే తెలుగు సాహిత్యంలో ఆరేళ్ల పాటు పరిశోధన చేసి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించారు. ఇప్పటివరకు ఆమె ఐదు జాతీయ, రెండు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని తెలుగు సాహిత్యంలో పరిశోధనా పత్రాలను సమర్పించారు. వివిధ సాహితీ సదస్సుల్లో పాల్గొని నేర్చుకున్న అంశాలను తరగతి విద్యార్థులకు అనుగుణంగా బోధించి తెలుగు భాష పట్ల ఆసక్తిని పెంచి తెలుగులో నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆమె రాసిన ఏడు తెలుగు పరిశోధనా వ్యాసాలు యూజీసీ కేర్ లిస్టెడ్ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. వినుకొండ ప్రాంతానికి చెందిన ప్రముఖ పద్య కవులతో పాటు, ఈ పరగణాకు చెందిన ప్రముఖ కవి గుర్రం జాషువా, బీర్నడి, మోషే,గద్దల జోసఫ్ వంటి తెలుగు సాహితీ చైతన్యమూర్తుల రచనల నుంచి పరిశోధనా వ్యాసాలతో కూడిన భిన్న స్వరాలు పుస్తకాన్ని ఇటీవల ప్రచురించి సాహిత్యాభిమానుల ప్రశంసలు అందుకున్నారు పద్మ.



డాక్టర్ పద్మ రాసిన కవితాసంపుటి


డాక్టర్ పద్మ

రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో బహుమతులు



శ్రీనివాసరాజును యాజమాన్యం

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ప్రతిభచాటి బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న సి.హెచ్.మారుతీ శ్రీనివాసరాజు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు పశ్చిమగోదావరి యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం సరస్వతి విద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసనా స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ చాటినట్లు తెలిపారు. సుపైన్ వ్యక్తిగత విభాగంలో ద్వితీయ స్థానం, ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు వివరించారు. బహుమతులు సాధించిన మారుతీ శ్రీనివాసరాజును కళాశాల చైర్మన్ ఎంఎస్ చక్రవర్తి, డీన్ డాక్టర్ శర్మ, ఏవో శ్రీధర్, వ్యాయామ అధ్యాపకులు ఎల్.కృష్ణారెడ్డి, ఆంజనేయులు, విజయకుమార్‌లు అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com